సాక్షి అనకాపల్లి

మంగళవారం । 31 । జనవరి । 2023



మహిళా హాకీ విజేత అనకాపల్లి

యలమంచిలిలో జరిగిన రాష్ట్ర స్థాయి మహిళా హాకీ పోటీల్లో అనకాపల్లి జిల్లా జట్టు విజేతగా నిలిచింది.

8లో



వేల గొంతులు ఒక్కటై..

8లో

ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రజా గర్జన సభ నిర్వహించారు.

శంకరమఠంలో దత్తాత్రేయ



విశాఖ: హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ సోమవారం శంకరమఠంలోని కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి దర్శనం చేసుకున్నారు. స్వామివారి యోగక్షేమాలు తెలుసుకున్నారు.

న్యూస్‌రీల్

నేడు రాష్ట్ర గవర్నర్ రాక



మహారాణిపేట : రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ మంగళవారం విశాఖ వస్తున్నారు. ఉదయం 10.40 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకుంటారు. ఏయూ కాన్వొకేషన్ సెంటర్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడ నుంచి మధ్యాహ్నం 12.50 గంటలకు పోర్టు గెస్టు హౌస్ చేరుకొని కొద్దిసేపు విశ్రాంతి తీసుకుంటారు. మధ్యాహ్నం 2.20 గంటలకు పోర్టు గెస్టుహౌస్ నుంచి బయలు దేరి చినముషిడివాడ శ్రీ శారదా పీఠానికి చేరుకుంటారు. 3 నుంచి 3.15 గంటల వరకు శారదాపీఠంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. 3.45 గంటలకు విశాఖ విమానాశ్రయం నుంచి విమానంలో గన్నవరం వెళ్తారు.

హెచ్‌ఎం సస్పెన్షన్, నలుగురు టీచర్లకు షోకాజ్

పాయకరావుపేట : పట్టణంలోని కేహెచ్ వాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.సుందరంను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి ఉత్తర్వులు అందినట్లు మండల విద్యాశాఖ అధికారి కె.ఎస్.గాంధీ తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వల్లే హెచ్‌ఎంను సస్పెండ్ చేసినట్లు సోమవారం వెల్లడించారు. అదే విధంగా పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు రమణరాజు, బయాలజీ ఉపాధ్యాయుడు కుమార్, సోషల్ ఉపాధ్యాయురాలు పద్మావతి, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు పి.శ్రీనులకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. ఈ నెల 10న పాఠశాలను తనిఖీ చేయగా ఉపాధ్యాయులు లెసన్ ప్లాన్లు, టీచింగ్ డైరీలు సక్రమంగా వ్రాయడం లేదని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించి వీరికి షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు ఎంఈవో తెలిపారు.

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎస్.రాయవరం విద్యార్థులు

ఎస్.రాయవరం: జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎస్.రాయవరం ఉన్నత పాఠశాల్లో చదువుతోన్న ఇద్దరు బాలికలు ఎంపికయినట్టు పీడీ శ్రీనివాస్ సోమవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వైఎస్సార్ కడప జిల్లాలో జనవరి 28, 29, 30 తేదీల్లో మూడు రోజులపాటు రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విశాఖపట్నం జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచినట్టు శ్రీనివాస్ పేర్కొన్నారు. అండర్ 17 విభాగంలో ఎస్.రాయవరం ఉన్నత పాఠశాల విద్యార్థులు పి.సులోచన, జి.హేమహసీనా జాతీయ స్థాయికి ఎంపికైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మ, ఉపాధ్యాయులు , కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు విద్యార్థులను అభినందించారు.

చరిత్ర గతిని మార్చేలా..

- కుష్టురహిత జిల్లా సాధనకు వైద్య ఆరోగ్య శాఖ కృషి
- 'పోరాడదాం- లెప్రసీని చరిత్రగా మార్చేద్దాం' నినాదంతో వ్యాధిపై సమరం
- వచ్చే నెల 13 వరకు గ్రామ సభల్లో అవగాహన కార్యక్రమం
- జిల్లాలో 95 శాతం ఇళ్లలో సర్వే పూర్తి
- 2030 నాటికి కుష్టును రూపుమాపడమే లక్ష్యం

సాక్షి, అనకాపల్లి: లెప్రసీరహిత జిల్లాగా చేయడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పల్లె ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. ప్రతి పంచాయతీలో జరిగే గ్రామ సభల్లో సర్పంచ్, రెవెన్యూ అధికారి, పంచాయతీ కార్యదర్శుల సహకారంతో వైద్య బృందం ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో 1520 బృందాలు పాల్గొంటున్నాయి. అనుమానితులను పరీక్షించి సమీప ప్రభుత్వ ఆస్పత్రులకు తీసుకెళ్లి నిర్ధారణ పరీక్షలు చేయిస్తారు. 'కుష్టు వ్యాధితో పోరాడదాం.. గత చరిత్రగా మార్చేద్దాం' అనే నినాదంతో జిల్లా యంత్రాంగం కుష్టువ్యాధిపై సమరం సాగిస్తోంది. కుష్టు అంటురోగం కాదు. సకాలంలో గుర్తించి ప్రాథమిక దశలోనే మెరుగైన చికిత్స అందిస్తే .. దీనిని పూర్తి స్థాయిలో అదుపుచేసే అవకాశముంటుందని వైద్యులు వెల్లడిస్తున్నారు. చులకనగా చూస్తారని కొంతమంది వ్యాధిని బయటపెట్టడం లేదు. దీనివల్ల వ్యాధి ముదిరిపోవడమే కాకుండా... కుటుంబంలో ఇతరులకూ వ్యాపించడానికి అవకాశముంది. కుష్టువ్యాధి నిర్మూలనలో భాగంగా రోగులను గుర్తించి, వారికి సకాలంలో వైద్యసేవలందించేలా గత ఏడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంటింటా సర్వే చేపట్టాయి. జిల్లాలో 522 సచివాలయాల పరిధిలో మొత్తం 4.53 లక్షల కుటుంబాలు ఉన్నాయి. 95 శాతం ఇళ్లలో సర్వే పూర్తయింది.

చికిత్స పొందుతున్న వ్యాధిగ్రస్తులు	69 మంది
పరీక్షించిన అనుమానితులు	365మంది
కొత్తగా నిర్ధారణ అయిన కేసులు	40

లెప్రసీ లక్షణాలు ఇవే...

- శరీరంపై స్పర్శలేని మచ్చలు, రాగి రంగు మచ్చలు
- మందమైన మెరిసే జిడ్డు గల చర్మం.. ఉబ్బెత్తుగా, బత్తాయి తొక్కలాగ మారుతుంది
- చెవులపై, వీపుపై, ఎదపై నొప్పిలేని బొడిపెలు
- కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం
- ముక్కుదిబ్బడ, ముక్కులోంచి రక్తం కారడం, కాళ్లు, చేతులకు తిమ్మిర్లు
- అరచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం
- చేతివేళ్లు, కాలివేళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం ఏర్పడడం

చికిత్స విధానం...

కుష్టువ్యాధి 'మైకో బాక్టీరియం లెప్రె' అనే బాక్టీరియా వలన వస్తుంది. ఈ క్రిములు తుమ్మడం వలన, దగ్గడం వలన వ్యాప్తి చెందుతాయి. వ్యాధి లక్షణాలు కనిపించేందుకు 3 నుంచి 5 సంవత్సరాలు పడుతుంది. కుష్టు లక్షణాలున్న వారికి రెండు పద్ధతుల్లో వైద్యసేవలందిస్తారు. శరీరంపై మూడు మచ్చలున్న వారికి ఆరునెలలపాటు, ఐదు మచ్చలు పైబడి ఉన్నవారికి మల్టీ బ్యాసిలరీ (ఎంబీ) విధానంలో 12 నెలలపాటు చికిత్స అందిస్తారు. దీనిలో భాగంగా నెలకు ఒకసారి మందులను నేరుగా రోగుల ఇంటికే వైద్య సిబ్బంది అందిస్తారు. సర్వేలో గుర్తించిన రోగులకు సకాలంలో వైద్యం అందించడంతోపాటు ఆ వ్యాధిపై వారికి, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తారు. వ్యాధిని సకాలంలో గుర్తిస్తే మెరుగైన వైద్యంతో నివారించే అవకాశముంది. మల్టీ డ్రగ్ థెరపీతో ఈ వ్యాధిని అరికడుతున్నారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ థెరపీ అందుబాటులో ఉంటుంది.



ఇంటింటికీ వెళ్ల పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది, వలంటీర్లు



లెప్రసీ రహిత జిల్లానే లక్ష్యం...



కుష్టు రహితంగా జిల్లాను తీర్చిదిద్దేందుకు వైద్య శాఖ పనిచేస్తోంది. ప్రస్తుతం గ్రామాల్లో పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు పాల్గొంటున్నారు. ఇతరులకు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నారు. 2030 నాటికి వ్యాధిని పూర్తిగా రూపుమాపేలా వైద్యశాఖ కృషి చేస్తోంది.

– డాక్టర్ ఎ.శారదాబాయి, అడిషనల్ డీఎంహెచ్‌వో (లెప్రసీ అండ్ టీబీ)

'స్థానిక' నోటిఫికేషన్ జారీ

- ఖాళీగా ఉన్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కో ఆప్షన్ సభ్యుడు పదవులకు 3న ఎన్నికలు

మహారాణిపేట (విశాఖ దక్షిణ)/అనకాపల్లి టౌన్: అనకాపల్లి జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కో ఆప్షన్ సభ్యుడు పదవులకు ఎన్నికలు నిర్వహించేందుకు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ ఎన్నికల కోసం ఈనెల 27న రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయగా.. జిల్లాలో ఉన్న ఖాళీలను బట్టి జిల్లా కలెక్టర్ స్థానిక నోటిఫికేషన్‌ను సోమవారం జారీ చేశారు. ఎన్నికలు జరిగే మూడుచోట్ల స్థానిక ప్రిసైడింగ్ ఆఫీసర్లు కూడా నోటిఫికేషన్ వెలువరించారు. ఎస్.రాయవరం మండలంలో ఎంపీపీ, పాయకరావుపేట మండలంలో రెండో వైస్ ఎంపీపీ, కోటవురట్ల మండలంలో కోఆప్షన్ సభ్యుడి స్థానాలకు ఫిబ్రవరి 3న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆరోజు ఉదయం 11 గంటలకు ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో నిర్వహించనున్న ప్రత్యేక సమావేశాల్లో సభ్యులు చేతులెత్తి ఎంపీపీ, వైస్ ఎంపీపీలను ఎన్నుకుంటారు. జెడ్పీ సీఈవో శ్రీరామ్మూర్తి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ఎన్నికలు ఎందుకంటే..

ఎస్.రాయవరం ఎంపీపీ పదవికి బొలిశెట్టి శారద రాజీనామా చేయడంతో ఎన్నిక నిర్వహించాల్సివస్తోంది. ఇక్కడి ఎంపీటీసీల సంఖ్య 21. వైఎస్సార్‌సీపీ 17 స్థానాలు, టీడీపీ 3, జనసేన ఒక స్థానంలో గెలిచాయి. ప్రిసైడింగ్ అధికారిగా డీఆర్‌డీఏ పీడీ డి.లక్ష్మీపతి వ్యవహరిస్తున్నారు. పాయకరావుపేట వైస్ ఎంపీపీ-2 కొడి నల్లబ్బాయి చనిపోవడంతో ఇక్కడ ఎన్నిక నిర్వహిస్తున్నారు. మొత్తం 27 ఎంపీటీసీల స్థానాల్లో వైఎస్సార్‌సీపీకి 16, టీడీపీకి 8, జనసేనకు ఒకటి, ఇండిపెండెంట్లకు రెండు స్థానాలు దక్కాయి. ప్రిసైడింగ్ అధికారిగా ఏపీ సీఎస్‌ఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లచ్చన్న వ్యవహరిస్తున్నారు. కోటవురట్ల మండలంలో కోఆప్షన్ సభ్యురాలు ఎం.సువర్ణలత రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. ప్రిసైడింగ్ అధికారిగా పంచాయతీరాజ్ డీఎల్‌డీవో ఉదయశ్రీ వ్యవహరిస్తున్నారు. ఇక్కడ 16 మంది ఎంపీటీసీల్లో 11 మంది వైఎస్సార్‌సీపీ సభ్యులు, ఐదుగురు టీడీపీ సభ్యులు ఉన్నారు.

జిల్లాలో 13,086 మందికి చేదోడు

- రజకులు, నాయీ బ్రాహ్మణులు, దర్జీల ఖాతాల్లో రూ.10 వేల వంతున జమ
- దుకాణాలున్న అర్హులకు మూడేళ్లలో రూ.37.73 కోట్ల ఆర్థిక సాయం



లబ్ధిదారులకు జగనన్న చేదోడు చెక్కును అందజేస్తున్న మంజులావాణి

అనకాపల్లి టౌన్: జగనన్న చేదోడు పథకం కింద జిల్లాలో అర్హత కలిగిన 13,086 మంది లబ్ధిదారులకు సోమవారం రూ.10 వేల వంతున ఆర్థిక సాయం లభించింది. ఈ పథకంలో భాగంగా దుకాణాలు ఉన్న రజకులు, నాయీబ్రాహ్మణులు, దర్జీలను రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లుగా ఆర్థికంగా ఆదుకుంటున్న విషయం తెలిసిందే. పల్నాడు జిల్లా వినుకొండలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కడంతో సొమ్ము లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ కావడం ప్రారంభమైంది. ఈ సందర్భంగా సీఎం చేసిన ప్రసంగాన్ని స్థానిక గాంధీనగరం జీవీఎంసీ కల్యాణమండపంలో లబ్ధిదారులు వర్చువల్ విధానంలో ఆలకించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా అధికారి మంజులావాణి లబ్ధిదారులకు రూ.13 కోట్ల 8 లక్షల 60 వేల చెక్కును అందజేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటి విడతలో 13,132మందికి రూ.13 కోట్ల 13 లక్షల 20 వేలు, రెండో విడతలో 11,513మందికి రూ.11 కోట్ల 51 లక్షల 30 వేలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారని చెప్పారు.

అర్హులైన లబ్ధిదారుల షాపులను జియోట్యాగ్ చేసిన తరువాత మాత్రమే సాయం అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీసీడీ అసిస్టెంట్ జిల్లా అధికారి కె.సురేష్, సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారి వి.రమణమ్మ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చేదోడు లబ్ధిదారులు	
రజకులు	4,629
దర్జీలు	6,260
నాయీ బ్రాహ్మణులు	2,197
మొత్తం	13,086

నెరవేరిన గాంధీజీ కల



మహాత్మగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

- సీఎం జగన్ పాలనలో గ్రామ స్వరాజ్యం సాకారం
- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు
- బోయిలకింతాడలో మహాత్ముడి విగ్రహానికి ఘన నివాళి

దేవరాపల్లి: మహాత్మగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా అందుబాటులోకి తెచ్చారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. బోయిలకింతాడలో స్థానిక సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు నేతృత్వంలో సోమవారం జరిగిన గాంధీజీ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతిపిత విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల చెంతకే పాలన తీసుకురావడంతో గ్రామ స్వరాజ్యం కల సాకారమైందన్నారు. మూడేళ్ల క్రితం మహాత్ముని జయంతి రోజున సచివాలయ, వలంటీర్ వ్యవస్థలకు శ్రీకారం చుట్టిన సీఎం జగన్ మహాత్ముని పట్ల తనకున్న అభిమానాన్ని చాటుకున్నారన్నారు. ఉప సర్పంచ్ కోన శ్రీను, అన్నం రామునాయుడు, బొబ్బిలి రాము, పంచాయతీ సెక్రటరీ జామి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పాదచారులను ఢీకొట్టిన లారీ


- ఇద్దరు మృతి, ముగ్గురికి గాయాలు
- నామవరం వద్ద రోడ్డు ప్రమాదం



మృతుడు అప్పారావు



కృష్ణ మృతదేహం





సంఘటన స్థలంలో రోదిస్తున్న బంధువులు (ఇన్‌సెట్) ప్రమాదానికి కారణమైన లారీ

నక్కపల్లి/పాయకరావుపేట: జాతీయరహదారిపై నామవరం జంక్షన్ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని అత్యవసర చికిత్స కోసం తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. వివరాల్లోకి వెళ్తే పాయకరావుపేట మండలం నామవరం గ్రామానికి చెందిన బొట్టా కృష్ణ(38), పక్కుర్తి అప్పారావు(58), గొర్ల లక్ష్మీనారాయణ, పక్కుర్తి శ్రీనుబాబు, కొర్రా శ్రీనులు గుంటపల్లి రోడ్డు ఎదురుగా ఉన్న జంక్షన్‌లో రోడ్డు పక్కన నిల్చుని మాట్లాడుకుంటున్నారు. రాజమండ్రి నుంచి విశాఖ వెళ్తున్న లారీ వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బొట్టా కృష్ణ, పక్కుర్తి అప్పారావులు అక్కడికక్కడే మృతిచెందారు. వీరి తల, ఇతర శరీర భాగాలు టైర్ల కింద పడి నుజ్జునుజ్జయ్యాయి. లక్ష్మీనారాయణ, పక్కుర్తి శ్రీను, కొర్రా శ్రీను దూరంగా పడి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను అత్యవసర చికిత్స కోసం తుని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతి చెందిన వారిని పోస్టుమార్టం కోసం నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు.



మృతుడు బొట్టా కృష (ఫైల్)

మృతి చెందిన వారిలో బొట్టా కృష్ణ హైదరాబాద్‌లో ఉంటూ సినీ పరిశ్రమ ప్రొడక్షన్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. వేంపాడుకు చెందిన మేనమామ కుమార్తెను వివాహం చేసుకున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అవసరాల రీత్యా అప్పు కోసం బ్యాంకు పని మీద కొన్ని రోజుల కిందట హైదరాబాద్ నుంచి వచ్చాడు. ఈ పనిలో భాగంగానే రెండు రోజుల క్రితం నామవరం బయల్దేరాడు. ఇతని భార్య, పిల్లలు ప్రస్తుతం హైదరాబాద్‌లోనే ఉన్నారు. ఇతని మరణ వార్త భార్యకు, పిల్లలకు ఎలా చెప్పాలో, చెప్తే వారి పరిస్థితి ఎలా ఉంటుందోనన్న భయంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

మరో మృతుడు పక్కుర్తి అప్పారావుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పిల్లలకు వివాహాలయ్యాయి. ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు రోజు మాదిరిగానే మాట్లాడుకుంటుండగా ఈ ప్రమాదం జరగడాన్ని గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎక్కువ జన సంచారం కలిగిన ప్రాంతంలో జరిగిన ప్రమాదం వీరిని భయాందోళనలకు గురి చేస్తోంది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, మృతుల బంధువులు అధిక సంఖ్యలో సంఘటనా స్థలికి చేరుకున్నారు. ఒకే గ్రామానికి చెందినవారు, మృతులు, క్షతగాత్రులకు బంధుత్వాలు కలిగి ఉండటంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతదేహాలను నక్కపల్లి తరలించామని, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ జోగారావు తెలిపారు.

వీఆర్వో లైంగిక వేధింపులు

- ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసిన మహిళకు అసభ్య సందేశాలు
- దేహశుద్ధి చేసిన బాధితురాలు.. అధికారులకు ఫిర్యాదు



వీఆర్వోకు దేహశుద్ధి చేస్తున్న బాధిత మహిళ

పాయకరావుపేట: ఇంటి స్థలం మంజూరు చేయాలంటే నన్ను ప్రేమించు... పక్కా గృహం నిర్మించుకోవాలంటే పక్కలోకి రా... అంటూ ఒక వీఆర్వో దళిత మహిళతో బేరసారాలు సాగించాడు. అతని వేధింపులు తట్టుకోలేని బాధిత మహిళ బంధువుల సమక్షంలో వీఆర్వోకు దేహశుద్ధి చేసింది. బాధిత మహిళ తెలిపిన వివరాలు, పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. పి.ఎల్.పురం గ్రామానికి చెందిన వివాహిత ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసింది. ఈ దరఖాస్తు వీఆర్వో భాస్కరనాయుడు పరిశీలనకు వచ్చింది. ఆయన మహిళకు ఫోన్ చేసి ప్రేమించమని, సహజీవనం చేయమని వేధించడం మొదలుపెట్టాడు. అప్పుడే పనవుతుందని బెదిరించాడు. వాట్సాప్‌లో కూడా అసభ్యకరమైన మెసేజ్‌లు చేసేవాడు. ఒకరోజు బాధితురాలికి ఫోన్ చేసి.. 'ఒంటరిగా ఉంటున్నావు.. నాతో సహజీవనం చేస్తే అన్నీ చూసుకుంటాన'ని ఒత్తిడి చేశాడు. వీఆర్వో వేధింపులు సహించలేక ఆమె కుటుంబ సభ్యుల దృష్టికి సమస్యను తీసుకువచ్చింది. వీఆర్వో వద్దకు వెళ్లి నిలదీయగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. దీంతో బాధిత మహిళ, ఆమె కుటుంబ సభ్యులు వీఆర్వోకు దేహశుద్ధి చేశారు. బాధితురాలు తహసీల్దార్ జయప్రకాష్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి, వీఆర్వోను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

మాతా, శిశువులకు మంచి రోజులు

- ఎన్టీఆర్ ఆస్పత్రిలో రూ.92 లక్షలతో తల్లి, నవజాతశిశువు నూతన భవనం
- రూ.30 లక్షలతో పిల్లల హైడెన్సిటీ వార్డు ప్రారంభం
- ఆస్పత్రి ఎదురుగా రూ.4 కోట్లతో నూతన భవనం నిర్మాణం
- మార్చి 1 నుంచి ఫ్యామిలీ ఫిజీషియన్-మంత్రి అమర్‌నాథ్



హైడెన్సిటీ వార్డును ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, చిత్రంలో ఎంపీ సత్యవతి, జేసీ కల్పనాకుమారి

అనకాపల్లి టౌన్ : రోగులకు సకాలంలో మెరుగైన వైద్యం అందించినట్లయితే ఆర్థికంగా వారిని ఆదుకున్నట్టేనని, అందుకే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైద్యానికి పెద్దపీట వేశారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో రూ.92 లక్షలతో నిర్మించిన తల్లి, నవజాత శిశువు నూతన భవనం, రూ.30 లక్షలతో ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన హైడెన్సిటీ వార్డును మంత్రి అమర్‌నాథ్, ఎంపీ బీవీ సత్యవతి, జేసీ కల్పనాకుమారిలు డీసీహెచ్‌ఎస్ కె.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ మార్చి 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తాయన్నారు. తమ ప్రభుత్వం అధికారం చేపట్టాక వైద్యాలయంలో ఖాళీగా ఉన్న 45మంది వైద్యుల నియామకంతోపాటు, 20 మంది హెడ్‌నర్సులు, సిబ్బందిని కూడా భర్తీ చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైద్యశాఖలో ఇప్పటి వరకు 26 వేల పోస్టులను భర్తీ చేసినట్లు వెల్లడించారు. జిల్లా పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతోందన్నారు. కంపెనీల్లో ప్రమాదాలు జరిగినపుడు క్షతగాత్రులు ఇబ్బందులు పడకుండా ఉండాలనే ఆస్పత్రిని దశల వారీగా అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. ఎంపీ సత్యవతి మాట్లాడుతూ తమిళనాడులోని వెల్లూరు ఆస్పత్రి మాదిరిగా స్థానిక వైద్యాలయాన్ని అభివృద్ధి చేయడం శుభపరిణామమన్నారు. గర్భిణులను ప్రసవ సమయంలో తలెత్తే కొన్ని ఇబ్బందులు వల్ల కేజీహెచ్‌కు తరలించవలసి వస్తోందని, ఇక మీదట అలాంటి దుస్థితి ఉండబోదన్నారు. జేసీ కల్పనాకుమారి మాట్లాడుతూ లారెన్స్ కంపెనీ రూ.4 కోట్లతో బర్న్స్‌వార్డు నిర్మాణంతోపాటు, వైద్య సిబ్బంది నియామకంతో ప్రమాదాల్లో గాయపడిన వారికి వీలైనంత వేగంగా మెరుగైన వైద్యం అందించొచ్చన్నారు. అనంతరం కొత్తగా నియమితులైన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులను మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతిలు సత్కరించారు.

ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ఎ.హేమంత్ కుమార్, మాతా, శిశు విభాగం సీనియర్ వైద్యురాలు అనురాధ, 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య, జెడ్పీ వైస్‌చైర్మన్ భీశెట్టి వరాహ సత్యవతి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి జోసెఫ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పలకా యశోద, వైఎస్సార్‌సీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, పట్టణ యువజన విభాగం కార్యదర్శి జాజుల రమేష్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పార్టీ నేతలు కొణతాల మురళీకృష్ణ, గైపూర్‌రాజు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర పీఆర్ ఇంజినీరింగ్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ



డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆవిష్కరించారు. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆయన్ను తారువ క్యాంప్ కార్యాలయంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖలో చేపట్టే నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యతా ప్రమాణాలను పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ మద్దిలేటి వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి కె. సంగీతరావు, కోశాధికారి బి.రవి, విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎం. సత్యనారాయణ పాల్గొన్నారు.

ట్రైబల్ యూత్ ప్రోగ్రాంకు ఇంటర్ విద్యార్థినులు



విద్యార్థినులు భారతి, గౌరి

అచ్యుతాపురం (అనకాపల్లి): గోవాలో ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 8వ తేదీ వరకు నిర్వహించే 14వ ట్రైబల్ యూత్ ప్రోగ్రాంకు ఉమ్మడి విశాఖ జిల్లా తరఫున ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థినులు భారతి, గౌరీ ఎంపికయినట్లు అచ్యుతాపురం ప్రశాంతి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ధర్మిరెడ్డి అప్పలనాయుడు సోమవారం తెలిపారు. ఉత్తరాంధ్ర నుంచి ఎంపికైన 20 మందిలో తమ కళాశాల విద్యార్థులు ఉండటం గర్వకారణమని కళాశాల కరస్పాండెంట్ ధర్మిరెడ్డి ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థినులను అభినందించారు.

అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించండి

- అధికారులకు జేసీ కల్పనాకుమారి ఆదేశం
- కలెక్టరేట్ స్పందనకు 165 అర్జీలు



అర్జీలను స్వీకరిస్తున్న జేసీ కల్పనాకుమారి, డీఆర్వో వెంకటరమణ



దివ్యాంగుడు వీరుయాదవ్ సమస్యను వింటున్న ఎస్పీ గౌతమిసాలి

తుమ్మపాల: స్పందన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు ప్రతి అధికారి చొరవ చూపాలని జేసీ కల్పనాకుమారి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్పందన కార్యక్రమంపై ప్రజల నమ్మకానికి తగ్గట్టుగా వారి సమస్యల సత్వర పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. అత్యధికంగా రెవెన్యూ సంబంధిత సమస్యలు వస్తున్నాయని, అన్ని సమస్యలు నిర్ణీత గడువులో పరిష్కరించి అర్జీదారుడికి సంతృప్తికరమైన సమాధానం ఇవ్వాలన్నారు. మొత్తం 165 అర్జీలు నమోదైనట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో పి.వెంకటరమణ, సీపీవో జి.రామారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రీసర్వే ద్వారా డీ-పట్టాల్లో తప్పులను సవరించాలి...

ప్రభుత్వమిచ్చిన డీ-పట్టా పత్రాల్లో తేడాలు ఉన్నాయంటూ తమ సాగు భూముల్లో రీసర్వే నిలిపివేశారని, తక్షణమే దాన్ని ప్రారంభించి సవరణలు చేయాలని కోరుతూ అనకాపల్లి మండలం పాపయ్యసంతపాలెంకు చెందిన దళితులు స్పందనలో అర్జీ చేశారు. గ్రామంలో 30 ఎకరాలు కొండపోరంబోకు భూములను 1971, 1983 సంవత్సరాల్లో రెండు విడతలుగా ప్రభుత్వం తమకు అప్పగించి డీ-పట్టాలు మంజూరు చేసిందన్నారు. అప్పటి నుంచి జీడిమామిడి, యూకలిప్టస్ పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. డీ-పట్టాల ఆధారంగా పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నాయని తెలిపారు.

ఇటీవల చేపట్టిన రీసర్వేలో సాగు భూములకు, డీపట్టాలో సర్వే నంబర్లకు పొంతన లేదంటూ సర్వే నిలిపి వేశారని వాపోయారు. అధికారులు సమగ్ర విచారణ చేపట్టి మా సాగు ఆధారంగా డీ- పట్టాల్లో సవరణలు చేయాలని రైతులు మట్టా సూర్యప్రకాశరావు, మహలక్ష్మి, పైడితల్లి, ఎ.చెల్లయ్యమ్మ, ఎ.ఆనంద్, గొట్టివాడ చింతల్లి, నునబర్తి రమణ, ఎస్.మచ్చాలమ్మ కోరారు.

బతికుండగానే నవశకంలో చంపేశారు!...

వివాహమై రెండేళ్లవడంతో రైస్ కార్డు మంజూరు చేయాలంటూ కోరిన మహిళకు సచివాలయంలో చేదు అనుభవం ఎదురైంది. తాను బతికుండగానే మరణించినట్లు వలంటీర్ మ్యాపింగ్‌లో ఉందంటూ సచివాలయ సిబ్బంది డెత్ డిక్లరేషన్‌ను చూపించారని అచ్యుతాపురం మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన కె.ప్రియాంక కలెక్టరేట్‌లో స్పందనకు ఫిర్యాదు చేసింది. నవశకం సర్వేలో తన వివరాలు నమోదు చేయకుండా డెత్ చూపించారని వాపోయింది. రైస్ కార్డు మంజూరు చేసి, ప్రభుత్వ పథకాలకు అర్హత కల్పించాలని కోరింది.

ఎస్పీ స్పందనకు 26 అర్జీలు

అనకాపల్లి టౌన్: ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందనకు 26 అర్జీలు వచ్చినట్లు ఎస్పీ గౌతమిసాలి తెలిపారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి అర్జీలుదారులు ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ తదితర వాటిపై అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు. చట్ట పరిధిలో సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కింద స్థాయి సిబ్బందికి ఆమె ఆదేశాలు జారీ చేశారు.

చరణ్ గ్రూపు భూఆక్రమణపై ఫిర్యాదు

రావికమతం: తమ తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన పదెకరాల భూమిని చరణ్ గ్రూపు సంస్థ ఆక్రమించడమేగాక, వాటిని ఇతర రైతుల పేరున ఆన్‌లైన్ చేసి మోసం చేసిందంటూ బాదనపాడు గ్రామ రైతులు పిల్లా సూర్యప్రకాషరావు, నూకరాజు కలెక్టరేట్ స్పందనలో సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో చరణ్ గ్రూపు రియల్ ఎస్టేట్ సంస్థ ఖాతా నంబరు 81, 82లో 14 ఎకరాలు కొనుగోలు చేసింది. సర్వే నంబరు 40లో తమ తండ్రి పిల్లా అచ్చారావు పేరున పదెకరాల భూములున్నాయి. ఈ మొత్తం భూమి తమ సాగులోనే ఉన్నప్పటికీ ఇతర రైతులు ఉగ్గిన అప్పారావు, సింహాద్రి, భూపతిరాజు, సత్యనారాయణ, బద్ది అఖిల పేరున ఆన్‌లైన్ చేసి సొంతం చేసుకోవాలని చూస్తుందని, దీనిపై సమగ్ర సర్వే చేయించి ఆన్‌లైన్ మోసాన్ని బయటపెట్టి వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

వైఎస్సార్ తీర్థ మహోత్సవం నేడు



కశింకోట : మండలంలోని అమీన్‌సాహెబ్‌పేట గ్రామంలో మంగళవారం వైఎస్సార్ తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మలసాల కిశోర్ సోమవారం తెలిపారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు పేర్కొన్నారు. 14 ఏళ్లుగా ఏటా ఇక్కడ వైఎస్సార్ పేరిట తీర్థాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. చుట్టుపక్కల ప్రాంతాలతోపాటు, జిల్లా నలుమూలల నుంచి ప్రజలు ఉత్సాహంగా పాల్గొంటారని పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించనున్నట్టు తెలిపారు. తీర్థమహోత్సవం సందర్భంగా మండల స్థాయి రంగవల్లుల పోటీలు, మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్నసమారాధన, తోడపెద్దు సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు జిల్లాస్థాయి గుర్రపు పరుగు పందాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. గెలుపొందిన గుర్రాల నిర్వాహకులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులు అందజేయనున్నట్టు పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి మహిళా హాకీ విజేత అనకాపల్లి

- రన్నరప్‌గా కాకినాడ జట్టు
- బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే కన్నబాబురాజు



విజేత అనకాపల్లి హాకీ జట్టుకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి: రాష్ట్ర స్థాయి మహిళా హాకీ పోటీల విజేతగా అనకాపల్లి జిల్లా జట్టు నిలిచింది. కాకినాడ జట్టు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. యలమంచిలి రాజీవ్ క్రీడా మైదానంలో మూడు రోజులుగా నిర్వహించిన ఈ పోటీలు సోమవారంతో ముగిశాయి. రెండు సెమీ ఫైనల్స్ మ్యాచ్‌లు, అనకాపల్లి-కాకినాడ జట్ల మధ్య తుది పోరు ఉత్కంఠగా జరిగాయి. విజయం కోసం అనకాపల్లి, కాకినాడ క్రీడా జట్లు నువ్వానేనా అన్నట్లు తలపడ్డాయి. చివరకు అన్ని విభాగాల్లో సమష్టిగా రాణించిన అనకాపల్లి జట్టు 3-0 గోల్స్ తేడాతో కాకినాడపై సునాయస విజయాన్ని సాధించింది. తృతీయ స్థానం అనంతపురం జిల్లాకు దక్కింది. మొత్తం 22 జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో ఫైనల్ మ్యాచ్‌ను చూసేందుకు విద్యార్థులు, యువకులు, క్రీడాకారులు ఎగబడ్డారు. విజేత రన్నరప్ జట్లకు ఎమ్మెల్యే కన్నబాబురాజు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యలమంచిలి హాకీకి పుట్టినిల్లుగా విరాజిల్లుతుందన్నారు. ఇక్కడ హాకీ క్రీడలో రాణించి జాతీయ జట్లకు ఎంపికై ఎందరో సీనియర్ క్రీడాకారులు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సంపాదించారన్నారు. ఓడిపోయిన జట్లు ఎప్పుడూ నిరుత్సాహ పడకూడదని సూచించారు. ఓటమే గెలుపునకు తొలిమెట్టని, క్రీడల ద్వారా పోటీతత్వం అలవర్చుకోవాలని పేర్కొన్నారు.

ఇక్కడ రాజీవ్ క్రీడా మైదానంలో ఎన్నో రాష్ట్ర స్థాయి హాకీ మ్యాచ్‌లు జరిగాయన్నారు. యలమంచిలి హాకీ మైదానానికి రూపురేఖలు తన హయాంలోనే తీసుకువచ్చానని గుర్తు చేసుకున్నారు. అనకాపల్లి జిల్లా హాకీ జట్టు మొట్ట మొదటిగా విజయం సాధించడం హర్షించదగ్గ విషయమన్నారు. క్రీడాకారులందరూ జాతీయ స్థాయి పోటీల్లో అద్భుతంగా రాణించి రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో హాకీ క్రీడను ఎక్కువగా యలమంచిలి ప్రాంతపు క్రీడాకారులే మక్కువ చూపి రాణిస్తున్నారన్నారు. జిల్లా హాకీ అసోసియేషన్ కన్వీనర్ ఆడారి వీరునాయుడు, యలమంచిలి హాకీ అసోసియేషన్ కన్వీనర్ కొఠారు నరేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్తా, మాజీ ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర, సీఐ షేక్ గఫూర్, ఎస్‌ఐ పాపినాయుడు, దాసరి మహేష్, యలమంచిలి హాకీ అసోసియేషన్ ప్రెసిడెంటు జి.వి. రెడ్డి, అమ్మ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ దాసరి గుప్తా, సాయి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఔదార్యం



రూ.3 లక్షల మొత్తాన్ని వితరణగా అందిస్తున్న ఉపాధ్యాయులు



రూ.10 వేల ఆర్థిక సాయం అందిస్తున్న మౌనిక మణిబాల

- నీరజ్‌కు రూ.3 లక్షల ఆర్థిక సహాయం

రావికమతం: గురువులుగా విద్యాబుద్ధులు నేర్పడమే కాదు.. అనారోగ్యంతో బాధ పడుతున్న విద్యార్థిని ఆర్థికంగా ఆదుకున్నారు. మండలంలోని ఉపాధ్యాయులందరూ కలిసి కొత్తకోట హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న గర్రెడ్డి నీరజ్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.3 లక్షల సహాయాన్ని అందించారు. నీరజ్ బోన్‌మేరో మార్పిడికి రూ.30 లక్షల వరకూ ఖర్చవుతుంది. ఇటీవల నర్సీపట్నం వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డిని బాలుడి తల్లిదండ్రులు కలవగా ఆపరేషన్ చేయిస్తామని హామీ ఇచ్చారు. తక్షణ ఖర్చుల నిమిత్తం రూ.లక్ష చెక్కును అందించారు. ఇప్పటి వరకూ అప్పులు చేసి వైద్యం చేయించుకున్న ఆ కుటుంబం ఆర్థికంగా చిదిగిపోవడంతో పలువురు దాతలు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. కొత్తకోట గ్రామ ఎంపీటీసీ పైల చినమ్మలు మనుమరాలు డి.మౌనిక మణిబాల కూడా రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని నీరజ్ తల్లితండ్రులకు అందించారు.

సుందరకోట ప్రాంతాన్ని పరిశీలించిన ఆర్డీవో



సుందరకోటలో తుప్పలతో నిండిన రోడ్డును పరిశీలిస్తున్న నర్సీపట్నం ఆర్డీవో జయరాం

నాతవరం : గిరిజన ప్రాంతం సుందరకోట పంచాయతీని నర్సీపట్నం ఆర్డీవో హనుమంత జయరాం సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సింగం భవానీ పేరుపై మంజూరైన లేటరైట్ నిక్షేపాలను తవ్వి తరలించగా, హైకోర్టు ఆదేశాల మేరకు నిలుపుదల చేశారు. అప్పట్లో నిబంధనలు ఉల్లంఘించి చేపట్టిన తవ్వకాలపై 2020లో విజిలెన్సు ఏడీ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లేటరైట్ ఖనిజాలకు సంబంధించి రూ.18 కోట్లు జరిమానా విధించి ప్రభుత్వానికి చెల్లించాలని ఆదేశించారు. చాలా కాలం తర్వాత మరలా సుందరకోటలో లేటరైట్ నిక్షేపాలున్న ప్రదేశంలో రోడ్ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్టు గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్డీవో ఈ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్లు వేస్తున్నట్టుగా స్థానికులు కలెక్టరుకు ఫిర్యాదు చేశారన్నారు. కలెక్టరు ఆదేశాల ప్రకారం ఈ ప్రాంతాన్ని సందర్శించానన్నారు. గతంలో వేసిన రోడ్డుపై పెరిగిన తుప్పలను మాత్రమే తొలగిస్తున్నారన్నారు. కొత్తగా ఎలాంటి రోడ్డు పనులు చేయలేదన్నారు. నాతవరం డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, ఆర్‌ఐలు మధు, నారాయణరావు, వీఆర్వో బొత్స శ్రీను పాల్గొన్నారు.

జాతీయ త్రోబాల్ పోటీలకు హర్షిణిరెడ్డి



మెమెంటోతో హర్షిణిరెడ్డి

అనకాపల్లిటౌన్: నంద్యాల పట్టణంలో రాష్ట్ర స్థాయి 66వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ త్రోబాల్ పోటీలు సోమవారం జరిగాయి. ఈ పోటీల్లో అనకాపల్లి పట్టణంలో శ్రీ చైతన్య స్కూల్‌లో చదువుతున్న ఎ.హర్షిణిరెడ్డి నేషనల్ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.సత్యం చెప్పారు. అండర్-14 విభాగంలో బాలికల జట్టులో ఉమ్మడి విశాఖ జిల్లాల నుంచి జరిగిన పోటీల్లో హర్షిణిరెడ్డి గెలుపొందినట్టు ఆయన పేర్కొన్నారు.

రెండు ట్రాక్టర్లు సీజ్

అనకాపల్లిటౌన్ : ప్రభుత్వ అనుమతులు లేకుండా గ్రావెల్, కొండరాయిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం సీజ్ చేసినట్టు అనకాపల్లి తహసీల్దార్ కార్యాలయం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్-2 రమేష్ తెలిపారు. మండలంలోని గొలగాం, కొప్పాక, తారకరామారావు కాలనీ, సోములూరు కొండల వద్ద గ్రావెల్, కొండరాయి తరలించకుండా మూడు బృందాలను జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశాల మేరకు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. మైనింగ్, రెవెన్యూ అనుమతులు లేకుండా ట్రాక్టర్, లారీలు ద్వారా గ్రావెల్, కొండ రాయిని తరలించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గల్లంతైన విద్యార్థి కోసం గాలింపు



రేవుపోలవరంలో గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చేపడుతున్న పోలీసులు

ఎస్.రాయవరం : రేవుపోలవరం తీరంలో గల్లంతైన విద్యార్థి కోసం ఎస్.రాయవరం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఎస్‌ఐ ప్రసాద్‌రావు పర్యవేక్షణలో గజ ఈతగాళ్ల సహాయంతో అవసరమయిన చోట సముద్రంలో గాలింపు చేశారు. బాలుడి కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున రేవుపోలవరం తీరానికి చేరుకున్నారు. తీరం పరిసర ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర వెతికి చూశారు. ఈ గాలింపు చర్యలకు పెంటకోట మెరైన్ పోలీసులు, స్థానిక రెవెన్యూ సిబ్బంది సహాయ సహకారాలు అందించారు.

మేడపై నుంచి జారిపడి వ్యక్తి మృతి



కర్రి రాజీవ్‌గాంధీ (ఫైల్)

ఎస్.రాయవరం : మండల కేంద్రంలో ఇంటిమేడపై నుంచి వ్యక్తి జారిపడి సోమవారం మృతి చెందినట్టు ఎస్‌ఐ ప్రసాద్‌రావు తెలిపారు. ఎస్‌ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కర్రి రాజీవ్ గాంధీ(36) సోమవారం ఉదయం ఇంటి వద్ద మేడపై ఎక్కి ఫోన్ మాట్లాడుతుండగా ప్రమాదవశాత్తూ మెట్లపై నుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు హుటాహుటీన నక్కపల్లి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించినట్టు చెప్పారు. పంచనామా అయిన తరువాత కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్టు తెలిపారు. మృతునికి 3 నెలలు పాప, భార్య ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

వేల గొంతులు ఒక్కటై..



ప్రజాగర్జనకు హాజరైన ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు

- నినదించిన ఉక్కు కార్మికులు
- పెద్ద ఎత్తున ప్రజా గర్జన బహిరంగ సభ
- బీజేపీ మినహా అన్ని పార్టీల నాయకుల సంఘీభావం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వేలాది మంది ప్రజలు పెద్ద ఎత్తున నినదించారు. వారితో పాటు బహిరంగ సభకు హాజరైన నాయకులు కేంద్ర ప్రభుత్వం తమ నిర్ణయాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఉక్కునగరం త్రిష్ణా మైదానంలో సోమవారం పెద్ద ఎత్తున ప్రజా గర్జన బహిరంగ సభ నిర్వహించారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గర్జనలో బీజేపీ మినహా ఇతర రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకించారు. ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల రాష్ట్ర కార్యదర్శులు, జీవీఎంసీ కార్పొరేటర్లు, మేధావులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని తమ మద్దతు తెలియజేశారు.

ప్రారంభం నుంచి వైఎస్సార్ సీపీ మద్దతు

ప్రైవేటీకరణ అంశం తెరపైకి వచ్చి నాటి నుంచి వైఎస్సార్ సీపీ ఉద్యమానికి పూర్తి మద్దతు ఇస్తుంది. తమ పార్లమెంటరీ నాయకుడు విజయసాయిరెడ్డి నేతృత్వంలో పాదయాత్ర చేశాం. అన్ని కార్యక్రమాలకు అధికార పార్టీలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరయ్యారు. ముఖ్యమంత్రి కార్మిక సంఘాల నాయకులతో సమావేశమై స్పష్టమైన హామీ ఇచ్చారు.

– ముత్తంశెట్టి శ్రీనివాసరావు, భీమిలి ఎమ్మెల్యే

కాంగ్రెస్ వల్లే పీఎస్‌యూల ఏర్పాటు

ప్రధాని మోదీ పీఎస్‌యూలను గుజరాతీలకు పప్పు, బెల్లాలు లాగ పంచిపెట్టేస్తున్నాడు. రాహుల్ గాంధీ జోడో యాత్ర పూర్తయిన తర్వాత విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు తీసుకు వస్తాం. పార్లమెంట్‌లో తమకు ఉన్న 57 మంది ఎంపీలతో విశాఖ ఉక్కుపై నిలదీస్తాం.

– రాకేశ్ రెడ్డి, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్

ఎంపీల ఒత్తిడి వల్లే సాధ్యం

అధికార పార్టీకి చెందిన 37 మంది ఎంపీలు వస్తే తమ ఎంపీలు కూడా వస్తారని.. తద్వారా 52 మంది ఎంపీలతో కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీద్దాం. అప్పుడు కేంద్ర ప్రభుత్వం తలొగ్గాల్సిందే. తగిన కృషి చేయకపోతే చరిత్ర హీనులుగా మారుతారు.

– కె.రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

ప్రజలను భాగస్వాములను చేయాలి..

ఈ ఉద్యమాన్ని రాష్ట్ర ఉద్యమంగా మార్చాలి. తద్వారా 5 కోట్ల మందిని ఉద్యమంలోకి భాగస్వాములను చేయాలి. ఆత్మనిర్భర్ అంటే పోస్కో వంటి విదేశీ సంస్థలకు పరిశ్రమలను అప్పగించడం కాదు. పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీలు తమ గళం విప్పాలి.

– కె.శ్రీనివాసరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి

క్లుప్తంగా

రేపటి నుంచి కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం

అనకాపల్లిటౌన్ : స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ 98వ వార్షికోత్సవ కార్యక్రమాలు ఫిబ్రవరి 1, 2, 3వ తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు బిళ్ల పాటి కృష్ణకుమార్ సోమవారం తెలిపారు. 1న ధ్వజారోహణ, బలిహారణం, సాయంత్రం నాగేశ్వరస్వామి, జనార్దనస్వామివార్ల మహోత్సవం, చిన్నవీధి రామాలయం వద్ద ఎదురు సన్మాన కార్యక్రమం, విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం, రాత్రి ఆలయ మండలంలో కల్యాణ వేడుకలు నిర్వహిస్తామన్నారు. 2న సాయంత్రం సదస్యం, నాగవల్లీ పండితుల సత్కారం, 3న శ్రీవార్ల పుష్పాంజలిసేవ కార్యక్రమాలతో వేడుకలు ముగుస్తాయన్నారు.

ఫిబ్రవరి 1, 2 తేదీల్లో 'గడప గడపకు'

కశింకోట : మండలంలోని బయ్యవరం గ్రామంలో ఫిబ్రవరి 1, 2 తేదీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీపీ లక్ష్మి, ఎంపీడీవో అప్పారావులు సోమవారం తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొని, ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకుని, స్థానిక సమస్యలపై స్పందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి స్థానిక పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు అధికారులు పాల్గొనాల్సిందిగా కోరారు.

దశలవారీగా సీసీ రోడ్ల నిర్మాణం



వేల్పులవీధిలో సీసీ రోడ్డు వేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

అనకాపల్లిటౌన్ : పట్టణ పరిధిలో పాడైన వీధి రహదారులపై దశలవారీగా సీసీ రోడ్లు వేయనున్నట్టు జీవీఎంసీ ఏఈ సుమిత్ర తెలిపారు. రూ.11 లక్షల వ్యయంతో స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఆలయం నుంచి సీతారామ కల్యాణమండపం వరకు 150 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనుల్ని సోమవారం ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో రహదారి నిర్మాణం పూర్తవుతుందన్నారు. రోడ్డు నిర్మాణ సమయంలో తిరుగాడకుండా స్థానిక ప్రజలు సహకరించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో డీఈ వేణుగోపాలరావు, ఈఈ చిరంజీవులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

ధమాకా	- రాజా
సిందూరం	-సత్యనారాయణ స్క్రీన్-1
పఠాన్	-సత్యనారాయణస్క్రీన్-2
18 పేజెస్	-షిర్డిసాయి
పఠాన్	-పర్తిసాయి
వీరసింహారెడ్డి	-వెంకటేశ్వర
హంట్	- శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	- రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 15,939 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,500	4,100
మొదటి రకం	3,100	3,470
రెండో రకం	2,860	3,340
మూడో రకం	2,780	2,850

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 37 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-10 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-9 యూనిట్లు, ఓ నెగిటివ్-4 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9182834480)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 511 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 426 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (9441108144)ని సంప్రదించవచ్చు.

బాపూ.. నీ బాటన నడిచే బలమివ్వు

మహాత్మా గాంధీ.. సత్యాగ్రహమనే ఆయుధంతో దేశ దాస్య శృంఖలాలను తెంచిన మహనీయుడు. జాతిపితగా జాతి యావత్తూ కుల మత భేదాలకతీతంగా కీర్తించే మహోన్నతుడు. అలాంటి వ్యక్తి.. ఇలాతలంలో ఇలాంటి నరుడు ఒకడుండేవాడా? అని భవిష్యత్తరాలు ఆశ్చర్యపోతాయేమో! ఆ మహనీయుడు మత ఛాందసుని ఆవేశానికి బలైన రోజు.. జనవరి 30. అందుకే ఊరూవాడా అనే తేడా లేకుండా సోమవారం గాంధీ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. మహాత్ముని విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



సోషల్ వెల్ఫేర్ కార్యాలయంలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మధుబాబు, వరబాబు



మార్కెట్‌యార్డులో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న యశోద, రవి దంపతులు



గాంధీనగరం వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు



సీపీఐ కార్యాలయంలో గాంధీజీ వర్ధంతి కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు

- ఊరూవాడా గాంధీ వర్ధంతి కార్యక్రమాలు

అనకాపల్లిటౌన్ : పట్టణ, మండలంలోని పలు ప్రాంతాల్లో మహాత్మాగాంధీ 75వ వర్ధంతి కార్యక్రమాలు సోమవారం ఘనంగా జరిగాయి. స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ కమిటీ కార్యాలయంలో సోమవారం కమిటీ చైర్‌పర్సన్ పలకా యశోద, రవి దంపతులు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటీష్ పాలన నుంచి భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహానేత గాంధీజీ అని కీర్తించారు. ఆయన మార్గాలు సత్యం, అహింస, నమ్మే సిద్ధాంత మూలాలను ప్రజలందరూ గాంధీ ఆశయసాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి శకుంతల, డైరెక్టర్లు నీటిపల్లి లక్ష్మి, మర్రివల్లి శోభ, బొబ్బిలి శ్యామల, ఈగల నూకరత్నం, బొడ్డు అచ్చిరాజు, పిట్టా అప్పలరాజు, దాడి కుమార్, గుండా రమేష్ గుప్తా పాల్గొన్నారు.

- స్థానిక గుండాల జంక్షన్ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి జిల్లా విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు, శాఖ పర్యవేక్షకులు అల్లు వరబాబులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ ఉద్యోగులు జ్యోతి, రమేష్, శ్రీనివాస్, సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.
- గాంధీనగరం అనకాపల్లి-చోడవరం రహదారి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు శ్రీనివాసరావు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- స్థానిక డైట్ కళాశాల ఆవరణలో మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు సోమవారం జరిగాయి. కళాశాల చైర్మన్, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ నరసింగరావులు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయులందరూ గాంధీ మార్గంలో నడవాలని కోరారు. దేశ అభివృద్ధి విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాపూజీకి సీపీఐ నేతల నివాళి

అనకాపల్లి రూరల్: స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం గాంధీజీ వర్ధంతి కార్యక్రమాన్ని మత సామరస్య దినంగా పాటించారు. ఐఎస్‌సీయూఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మళ్ల మాధవరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ, ప్రొఫెసర్ డాక్టర్ నూకరాజు గాంధీజీకి నివాళులర్పించారు. నాథూరాం గాడ్సే బాపూజీని కాల్చి చంపడం హేయమైన చర్య అన్నారు. స్వాతంత్ర్యం, సామాజిక న్యాయం, శాంతి, సత్యం, అహింసా మార్గంలో సత్యాగ్రహాన్నే ఆయుధంగా మలచిన మహనీయుడు గాంధీజీ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు సన్యాసిరావు, సాయి లక్ష్మణ్, శివరామ్, ప్రకాష్, వెంకటేశ్వరరావు, చిన్ని యాదవ్, సతీష్, సత్యారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

- స్థానిక ఆస్క్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం పూజ్య బాపూజీ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ వసంత రాజేంద్రప్రసాద్ గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాపూజీ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. దక్షిణాఫ్రికాలో జాతి వివక్షతను అనుభవించి, అక్కడి భారతీయుల పక్షాన గాంధీజీ చేసిన పోరాటాన్ని గుర్తు చేశారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా, సహాయ నిరాకరణోద్యమం తదితర పోరాట ఘట్టాల్లో ఆయన పాత్రను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆస్క్ ప్రిన్సిపాల్



గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దాడి రత్నాకర్, నరసింగరావులు

కశింకోట : మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. సర్పంచ్ మంత్రి జయరజని, పంచాయతీ కార్యదర్శి ఎస్.రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

- పంచాయతీ ప్రధాన రహదారిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు మల్లపురెడ్డి కోటేశ్వరరావు, పార్టీ జిల్లా కార్యదర్శి కత్తెర శ్రీధర్, ఉపాధ్యక్షుడు సూరిశెట్టి ఆదిబాబు పాల్గొన్నారు.
- తాళ్లపాలెం సచివాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యదర్శి వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.
- గురుకుల బాలికల పాఠశాలలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మళ్ల మాణిక్యం, ఉపాధ్యాయ సిబ్బంది గాంధీజీ త్యాగనిరతిని విద్యార్థులకు వివరించారు.

చౌడేశ్వరి సాంబశివుని కల్యాణం రేపు



చౌడేశ్వరి సాంబశివుని ఆలయం

- అట్టహాసంగా అమ్మవారి సారె ఊరేగింపు

అనకాపల్లిటౌన్ : స్థానిక చిన్నరాజుపేట శ్రీచౌడేశ్వరిసాంబశివుని కల్యాణ వేడుకలు బుధవారం నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధాన అర్చకులు చౌడేశ్వరి నందన్‌శర్మ సోమవారం తెలిపారు. స్వామివారి కల్యాణం ఆ రోజు సాయంత్రం అత్యంత వేడుకగా జరుగుతుందన్నారు. సాంబశివుని తరపున కోమళ్లపల్లి సుబ్రహ్మణ్యం, శ్రీవల్లీ దంపతులు, చౌడేశ్వరి అమ్మవారి తరపున రెడ్డి పోలనాగ వెంకట ప్రభాకర్, నాగలక్ష్మి దంపతులు కల్యాణంలో పాల్గొంటారని తెలిపారు. అమ్మవారి కల్యాణ ఉత్సవంలో భాగంగా సోమవారం సాయంత్రం తిరువీధుల్లో అమ్మవారి సారె ఊరేగింపు మేళతాళాల మధ్య అట్టహాసంగా నిర్వహించారు. భారీ సంఖ్యలో మహిళలు తమ ఇళ్లల్లో తయారు చేసిన సంప్రదాయ పిండివంటలు, కొత్త వస్త్రాలను నెత్తిన పెట్టుకుని పురవీధుల్లో ఊరేగించారు.



చౌడేశ్వరి సాంబశివుని వద్ద సారె నివేదన

మాదక ద్రవ్యాల నిర్మూలనకు కఠిన చర్యలు

అచ్యుతాపురం(అనకాపల్లి): మాదక ద్రవ్యాల వాడకంపై నిషేధం ఉందని, అది ఆరోగ్యానికి ప్రమాదకరమే కాకుండా వినియోగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని యలమంచిలి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జె. జనార్దనరావు అన్నారు. అచ్యుతాపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలు, వినియోగం వల్ల కలిగే అనర్థాలు, దీనికి సంబంధించిన నిషేధం, చట్టపరమైన కేసుల గురించి వివరించారు. విద్యార్థులు సన్మార్గంలో నడిచి మంచిగా విద్యాభ్యాసం చేయాలని, తద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. చెడు మార్గాల్లో పయనించే వ్యక్తులు, వారిని ప్రోత్సాహించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు.



అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

మాధవస్వామి తీర్థం పోస్టర్ ఆవిష్కరణ

పరవాడ: ముత్యాలమ్మపాలెంలో ఈ నెల 4న నిర్వహించనున్న మాధవస్వామి తీర్థ మహోత్సవానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సోమవారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, పార్టీ నాయకులు బి.భగవాన్ జయరాం, సీహెచ్ ముత్యాలు, బొంది రవి, చింతకాయల అమ్మోరు, సూరాడ ఎల్లాజీ, సోమునాయుడు, వి.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గంగాదేవితల్లి ఉత్సవం



కశింకోట : మండలంలోని జి.భీమవరంలో ఉన్న గంగాదేవితల్లి ఉత్సవం మంగళవారం పెద్దఎత్తున జరగనుంది. ఉత్సవానికి అవసరమైన ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఏటా జరిగే ఉత్సవానికి జి.భీమవరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హాజరవుతారని పేర్కొన్నారు. ఉత్సవంలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లిటౌన్ : పట్టణ పరిధిలో విద్యుత్ వైర్ల కింద జంగిల్ క్లీనింగ్, పాడైన ఇనుప స్తంభాలను తొలగించి కొత్త వాటిని ఫిబ్రవరి 1న ఏర్పాటు చేయనున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ ఎస్.రమణమూర్తి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కోట్నివీధి, తాకాశివీధి, పెరుగుబజార్, చేపల మార్కెట్, నెయ్యిలవీధి, చోడవరం బస్‌స్టాప్ రహదారి, నర్సింగరావుపేట, రైల్వే స్టేషన్ రహదారిలో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్టు తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాల్సిందిగా కోరారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

అనకాపల్లిటౌన్ : మండలంలోని సుందరయ్యపేట గ్రామానికి చెందిన బాధపు రమణ(41) రోడ్డు ప్రమాదంలో సోమవారం రాత్రి మృతి చెందాడు. గ్రామీణ ఎస్ఐ నర్సింగరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో రహదారి దాటుతుండగా ట్రాక్టర్ ఢీకొని రమణ మృతి చెందాడని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



1971-72 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు

అనకాపల్లిటౌన్ : స్థానిక జీవీఎంసీ చిన్న హైస్కూల్ 1971-72 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక సోమవారం కోలాహలంగా జరిగింది. గవరపాలెం నూకాంబిక రహదారి విశాఖ ఫైనాన్షియర్స్ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ సమ్మేళనానికి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. 51 సంవత్సరాల తర్వాత మరోసారి తమ పాత మిత్రుల్ని కలుసుకుని ఆనందపరవశులయ్యారు. చిన్ననాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ వయసును మరిచి, చిన్నపిల్లలుగా మారారు. తాము చదువుకున్న పాఠశాలకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బల్లా నాగభూషణం, బొడ్డేడ అప్పారావు, పిళ్లా శివఅప్పారావు, దాడి శివరామకృష్ణ, కొణతాల సీతారామబాబ్జీ, రొబ్బి చంద్రరావు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

అనకాపల్లి రూరల్: మండలంలోని తుమ్మపాల-2 సచివాలయ పరిధి గవరపేటలో సోమవారం కుష్టు వ్యాధి పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సోమవారం నుంచి వచ్చే నెల 13 వరకు ఈ అవగాహనా కార్యక్రమాలు కొనసాగుతాయని ఆరోగ్య సిబ్బంది తెలిపారు. కుష్టు వ్యాధి లక్షణాలు, చికిత్సా విధానం గురించి స్థానికులకు అవగాహన కల్పించారు. తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పంచదార్ల కన్నారావు, వ్యవసాయ సహాయకులు తారకరామారావు, వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కుష్టు వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

'ధాన్యం కొనుగోలులో నిర్లిప్తత తగదు'

కోటవురట్ల : రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు సంక్షేమ పథకాలతోపాటు, అనేక చర్యలు చేపడుతోందని, ధాన్యం కొనుగోలులో అధికారులు నిర్లిప్త ధోరణిలో ఉండడం బాధాకరమని జెడ్పీటీసీ సభ్యురాలు సిద్ధాబత్తుల ఉమాదేవి అన్నారు. స్థానిక ఆర్బీకేలో ధాన్యం కొనుగోలుపై సోమవారం మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తవ్వాలని సూచించారు. మండలంలో 3 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాల్సి ఉండగా ఇప్పటికి కేవలం 652 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరించారని, ఇటువంటి పరిస్థితుల్లో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని ఎంపీటీసీ సభ్యుడు పుత్రేవు సూర్యారావు అధికారులను ప్రశ్నించారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు జానకమ్మ, ఎంపీడీవో చంద్రశేఖర్, ఏవో అరుణకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సిద్ధాబత్తుల సత్యనారాయణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలుపై వివరణ ఇస్తున్న ఏవో అరుణకుమారి

నువ్వులతో రైతుల్లో చిరునవ్వులు

- రబీలో నువ్వుల సాగుతో రైతులకు ప్రయోజనం
- అనకాపల్లి సబ్‌డివిజన్‌లో 150 ఎకరాల్లో సాగు
- సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి

అనకాపల్లి రూరల్: పుష్కలంగా పోషకాలుండే నువ్వులను రబీలో ఆరుతడి పంటగా సాగు చేసి రైతులు లాభాలనార్జిస్తున్నారు. ఖరీఫ్ సీజన్ తరువాత వరి కోతలు పూర్తికాగానే, మిగులు వరి కంకులు తొలగించి జనవరి, ఫిబ్రవరి మొదటి వారం వరకూ నువ్వు సాగు చేపట్టడానికి అనుకూలం. అనకాపల్లి వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో ప్రస్తుత రబీ సీజన్లో సుమారు 150 ఎకరాల్లో నువ్వుల పంటను సాగు చేస్తున్నారు. గత 15 రోజుల నుంచి సాగు పనులు ఊపందుకున్నాయి.

సాగు సమయం తక్కువ.. రాబడి ఎక్కువ

ఇది 90 రోజుల పంట. ఎకరానికి 4 నుంచి 5 క్వింటాళ్ల మేర దిగుబడితో రూ.40 వేల నుంచి రూ.45 వేల వరకు రాబడి ఉంటుంది. తేలికైన నేలలు, పంట సాగుకు శ్రేష్ఠం. నీరు నిలిచే ఆమ్ల, క్షార గుణాల నేలలు ఈ పంట సాగుకు పనికిరావు. సాగుకు ముందు నేలను 2 నుంచి 3 సార్లు మెత్తగా దున్ని చదును చేసుకోవాలి. ఎకరాకు 2.5 కిలోల విత్తనాలు సరిపోతాయి. వరుసల మధ్య దూరం 30 సెం.మీ, మొక్కల మధ్య 15 సెం.మీ ఉంటే పంట ఎదుగుదల బాగుంటుంది. శ్వేత , హిమ (జేసీఎస్ 9456), రాజేశ్వరి, చందన, గౌరీ(జేసీఎస్ 1020) విత్తనాలు సాగుకు అనుకూలం. కిలో విత్తనాలకు 3 గ్రాముల మాంకోజెట్ కలిపి విత్తన శుద్ధి చేసుకుంటే మంచిది.



అనకాపల్లి సమీపంలో సాగులో ఉన్న నువ్వుల పంట


ఎరువులు వాడకం ఇలా..

నత్రజని 25 కిలోలు(55 కిలోల యూరియా), భాస్వరం 8 కిలోలు(30 కి.సూపర్‌ఫాస్ఫేట్), పొటాష్ 8 కిలోలు(14కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్)వేయాలి. విత్తిన వెంటనే పలచటి తడి ఇవ్వాలి. తేమ ఎక్కువగా ఉన్నందున మొక్కలు శాఖీయోత్పత్తి జరిగి, ఆకులు, కొమ్మలు బాగా వచ్చి పూత, కొమ్మ రాలకుండా ఉంటుంది. కలుపు నివారణకు పిండిమిథాలిన్ ఎకరానికి 1 లీటరు చొప్పున నీటిలో కలిపి, పిచికారీ చేయాలి.

తామర పురుగులు, పచ్చదోమ నివారణ

ఇవి ఆకుల అడుగు భాగాన చేరి ఆకుల నుంచి రసాన్ని పీల్చివేస్తాయి. దీని వల్ల ఆకులు ముందుగా పాలిపోయి తరువాత దశలో ఎండిపోతాయి. తెల్లనల్లి ఆశిస్తే ముదురు ఆకుపచ్చ రంగుకు మారి ఈనెలు పొడవుగా కిందకు సాగి ముడుచుకుపోతాయి. వీటి నివారణకు లీటరు నీటికి 2.మి.లీ. డైమిథోయేట్ కలిపి పిచాకారీ చేయాలి. తెల్లనల్లి నివారణకు డైకోఫాల్ 5.మి.లీ. మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది. వీటితో పాటు ఆకుముడత, కాయతొలిచే పురుగు, కోరి ఈగ, వేరుగు పుండ్లు, కాండం తెగుళ్లు, ఆకుపచ్చ, బూడిద తెగులు పంటకు వచ్చే అవకాశం ఉంది. వ్యవసాయాధికారుల సూచనలతో వీటి నివారణకు చర్యలు చేపట్టాలి.

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి



నువ్వు పంటకు సరైన సమయంలో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు వస్తాయి. పేనుబంక పురుగు పంట వేసిన 25 రోజుల్లో ఆశిస్తుంది. ఆకుల నుంచి తేనెలాంటి జిగురు పదార్థం విడుదల కావడం వల్ల పంట పరిసరాల్లో చీమలు కన్పిస్తాయి. దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీటర్లు, ఎసిఫెట్ 1 గ్రామును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పంట సమయం పూర్తయిన తరువాత పసుపు రంగులోకి రాగానే వెన్నులను కోసి కట్టలుగా కట్టి కిందకు వేలాడదీసి ఉంచాలి. వారం రోజులు ఎండిన తరువాత నూర్పిడి చేయాలి. గింజలను 8 శాతం వరకూ తేమ వచ్చే వరకూ ఆరబెట్టి, గోనె సంచుల్లో నిల్వచేసుకోవాలి.

– ఎం.రామారావు, ఏడీఏ, వ్యవసాయ సబ్‌డివిజన్, అనకాపల్లి

ముగిసిన శ్యామా నవరాత్రి ఉత్సవాలు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి పీఠంలో నిర్వహించిన శ్యామా నవరాత్రి ఉత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా రాజశ్యామల అమ్మవారికి క్షీరాభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. యూకేకి చెందిన వ్యక్తి రాజశ్యామలా హోమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వచ్చేనెల 1వ తేదీ నుంచి సహస్ర ఛండీ హోమాన్ని కెనడాకు చెందిన జీఆర్‌డీ అయ్యర్స్ గ్రూపు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు. ఈ హోమాన్ని ఐదు రోజుల పాటు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. లోక కల్యాణమే ప్రధాన సంకల్పంగా దీనిని నిర్వహించనున్నట్టు అన్నపూర్ణమ్మ తెలిపారు.